క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ ఇంటింటి ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న లావణ్య, సత్యవతి, తదితరులు

ఎంవీపీ కాలనీ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపులో మహిళలు కీలకపాత్ర పోషించాలని 17వ వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ స్థానిక మండల ప్రధాన కార్యదర్శి పిల్లా సత్యవతి ఆధ్వర్యంలో శుక్రవారం ఆదర్శనగర్‌లో ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఆవశ్యకతపై వారు ఇంటింటికి వెళ్లి వివరించారు. మహిళల సంక్షేమానికి, కుటుంబ అవసరాలకు అనుగుణంగా అమ్మఒడి, ఆసరా, చేయూత వంటి పథకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఈ ఎన్నికల్లో తూర్పు ఎమ్మెల్యేగా ఎంవీవీ సత్యనారాయణను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

'ఈమా' నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన ఈమా కార్యవర్గ సభ్యులు

బీచ్ రోడ్డు: ఈవెంట్ మేనేజర్స్ అసోసియేషన్ (ఈమా) విశాఖ చాప్టర్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. శుక్రవారం బీచ్ రోడ్డులోని ఓ హోటల్‌లో ఈమా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి, నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.సందీప్‌కుమార్, కార్యదర్శిగా షరీఫ్ ఖాన్, ఉపాధ్యక్షుడిగా సురేష్‌బాబు, సంయుక్త కార్యదర్శిగా సంతోష్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ధరణి సూకరాజు, కోశాధికారిగా పాలూరి కామేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రంలో విశాఖనగరం ఈవెంట్ రంగంలో ఎంతో ముందంజలో ఉందన్నారు. ప్రతి ఏడాది కోట్ల రూపాయల వ్యాపార లావాదేవీలు ఈవెంట్ రంగం ద్వారా జరుగుతున్నాయన్నారు.

క్లస్టర్-4 సేవాదళ్ అధ్యక్షుడికి సన్మానం



సేవాదళ్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

మద్దిలపాలెం : విశాఖ తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ క్లస్టర్-4 సేవాదళ్ అధ్యక్షుడిగా నియామకమైన పిలక మధుసూదన్‌రెడ్డిని విశాఖ ఎంపీ, తూర్పు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యానారాయణ శుక్రవారం తన కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నెరవేర్చాలన్నారు. పార్టీ విజయానికి క్షేత్రస్థాయిలో కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, 23వ వార్డు సీనియర్ నాయకుడు గుడ్ల సత్యారెడ్డి, వార్డు నాయకులు పాల్గొన్నారు.

16న జేఈఈ ఎర్లీ లీడ్ పరీక్ష

బీచ్ రోడ్డు: జేఈఈ 2025 పరీక్షకు సన్నద్ధమవుతున్న విద్యార్థుల కోసం ఎర్లీ లీడ్ ఎగ్జామ్‌ను ఈ నెల 16న నిర్వహించనున్నట్టు ఫిట్‌జీ ప్రతినిధి ఆర్.ఎల్.త్రిఖా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాల కోసం www.fiitjee.com వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.

సీఎం జగన్‌తోనే భావితరాల భవిష్యత్



సిద్ధం సభలో ప్రజలు



11వ వార్డు సిద్ధం సభలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: రాష్ట్రంలో సంక్షేమ పాలనతో పాటు భావితరాల భవిష్యత్ కోసం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 11వ వార్డు గాంధీనగర్‌లో శుక్రవారం మేము సిద్ధం-మా బూత్ సిద్ధం సభ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నగరం అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందన్నారు. అన్ని వార్డుల్లోనూ మేయర్ గొలగాని మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. గతంలో చంద్రబాబు పాలన సక్రమంగా లేకపోవడంతో ప్రజలు ఇంటికి పంపించారన్నారు. ఇప్పుడు వైఎస్ జగన్ పాలనకు చంద్రబాబు అడ్డు తగులుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు. ఇందులో భాగంగా వృద్ధులకు పింఛన్లు ఇంటి వద్ద ఇవ్వకుండా అడ్డుకున్నారని ఎంవీవీ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో చంద్రబాబును, తూర్పు నియోజకవర్గంలో వెలగపూడిని నమ్మవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, ఎస్సీ విభాగం జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, నగరాల డైరెక్టర్ కె.మోహనరావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కె.ఆర్ పాత్రుడు, మత్స్యకార నాయకుడు గంపల వెంకటరామచంద్రరావు, షకీనా పాల్గొన్నారు.

ఈ స్థలం మాది.. కాదు జీవీఎంసీది!

- ఆరిలోవలో 5.5 ఎకరాల స్థలంపై వివాదం
- ఓ వ్యక్తి చేపడుతున్న పనులను అడ్డుకున్న జీవీఎంసీ జోన్-2 అధికారులు



స్థలంలో ప్రైవేట్ వ్యక్తి చేపడుతున్న పనులను అడ్డుకుంటున్న జోన్-2 ఏసీపీ శాస్త్రి, సిబ్బంది

ఆరిలోవ: ఆరిలోవలో ఓ స్థలం విషయం వివాదాస్పదంగా మారింది. ఈ స్థలం తనదేనంటూ ఓ ప్రైవేట్ వ్యక్తి.. కాదు జీవీఎంసీకి చెందినదంటూ అధికారులు పట్టుపడుతున్నారు. ఇదిలా ఉండగా సదరు వ్యక్తి ఈ స్థలం తనకు చెందినదేనని కోర్టు నిర్ధారించిందంటూ శుక్రవారం కంచె నిర్మాణం కోసం పనులు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న జీవీఎంసీ అధికారులు ఆదేశాలతో జోన్-2 అధికారులు ఆ పనులను అడుఽ్డక్కున్నారు. వివరాలిలా ఉన్నాయి. జీవీఎంసీ 12వ వార్డు శ్రీకాంత్‌నగర్‌లో సర్వే నంబర్లు 18/2, 19/2, 29/2లలో 5.50 ఎకరాలు ఖాళీ స్థలం ఉంది. ఇందులో కొంత రోడ్డులో పోగా.. మరికొంత గెడ్డ భాగం కూడా ఉంది. ఈ స్థలం తనదేనంటూ కొన్నేళ్ల క్రితం బి.సత్యనారాయణ స్వాధీనం చేసుకోదలిచారు. అప్పట్లోనే జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు ఆయన ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. ఇది జీవీఎంసీకి చెందిన స్థలమని తెల్పి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో సత్యనారాయణ కోర్టును ఆశ్రయించారు. ఇప్పుడు కోర్టు ఈ స్థలం తనకు చెందినదిగా తీర్పు ఇచ్చినట్టు సత్యనారాయణ శుక్రవారం కొంత మందితో వచ్చి కంచె ఏర్పాటు పనులు మొదలుపెట్టారు. ఈ పనులు జరుగుతుండగా జీవీఎంసీ జోన్-2 ఏసీపీ శాస్త్రి సిబ్బందితో వెళ్లి ఆ స్థలంలో పనులు నిలిపేశారు. ఇది జీవీఎంసీకి చెందిన స్థలం కానుక ప్రైవేట్ వ్యక్తులు పనులు చేపట్టవద్దని సూచించారు. దీంతో సత్యనారాయణ అనుచరులు టౌన్ ప్లానింగ్ సిబ్బందితో వాగ్వాదానికి దిగడంతో ఇక్కడ కొంత సేపు గందరగోళం నెలకొంది. ఆఖరుకు ఈ స్థలం ఎవరికి చెందుతుందో వేచి చూడాల్సిందే.

దీనిపై సత్యనారాయణ స్పందిస్తూ 2010లో ఈ స్థలాన్ని ప్రేమసాయి అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నామన్నారు. హైకోర్టు కూడా ఈ స్థలం తమకు చెందినదని వారం క్రితం నిర్ధారించిందని చెప్పారు. అందుకే కంచె వేయడానికి వచ్చామన్నారు. దీనిపై జోన్-2 ఏసీపీ శాస్త్రి స్పందిస్తూ ఈ స్థలంపై ప్రస్తుతం కోర్టులో కేసు ఉందన్నారు. సత్యనారాయణకు చెందినట్లు కోర్టు నిర్ధారించినట్లయితే ప్లాన్ పెట్టుకొని పనులు చేపట్టాలని చెప్పారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 12వ వార్డు చినగదిలి ప్రాంతానికి చెందిన 100 మందికి పైగా యువకులు, మహిళలు వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం పార్టీ నాయకుడు గంపల వెంకట రామచంద్రరావు ఆధ్వర్యంలో లాసన్స్‌బే కాలనీలోని కార్యాలయంలో వారికి ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా రంజక పాలన, అభివృద్ధికి ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీ మాట్లాడుతూ వార్డులో పెద్ద ఎత్తున ప్రజలు వైఎస్సార్‌సీపీలో చేరడం ఆనందంగా ఉందన్నారు. కుల, మతాలకు అతీతంగా ముఖ్యమంత్రి జగన్ పేద ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అఖండ విజయానికి పెద్ద ఎత్తున కృషి చేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు విజయకుమార్, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ల అందజేత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆరిలోవకు చెందిన వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ

ఆరిలోవ: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శుక్రవారం సెలవైనా తూర్పు నియోజకవర్గంలో పింఛన్ల పంపిణీ కొనసాగింది. కొందరు వెల్ఫేర్ సెక్రటరీలు సచివాలయాలకు వెళ్లి వృదుఽ్ధల, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్లు అందించారు. శనివారం కూడా పింఛన్ల పంపిణీ జరగనుంది. నియోజకవర్గంలో మద్దిలపాలెం, ఎంవీపీ కాలనీ, ఇసుకతోట, పెదవాల్తేరు, చినవాల్తేరు, వెంకోజీపాలెం, ఆరిలోవ కాలనీ, దుర్గాబజార్, పైనాపిల్ కాలనీ, రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, బాలాజీనగర్, తోటగరువు, రవీంద్రనగర్, ఆదర్శనగర్, విశాలాక్షినగర్, చినగదిలి, పెదగదిలి, హనుమంతవాక ప్రాంతాలలో పింఛన్లు అందజేశారు. పలువురు సచివాలయాల సెక్రటరీలు కేజీహెచ్, ప్రైవేట్ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్న లబ్ధిదారులతో పాటు ఇళ్ల వద్ద బెడ్ రెస్ట్‌లో ఉన్న వారి వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ అందించేవారు. ఎన్నికల నిబంధనలు బూచిగా చూపించి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఫిర్యాదుతో సామాజిక పింఛన్‌దారులకు కష్టాలు ఎదురయ్యాయి. వృద్ధులు, దివ్యాంగులు సచివాలయాలకు వెళ్లి పింఛన్లు తీసుకోవడానికి ఇబ్బందులు పడుతుండగా.. మరో వైపు సచివాలయాల సెక్రటరీలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న లబ్ధిదారుల వద్దకు వెళ్లి పింఛన్ అందిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి.

రాష్ట్రాభివృద్ధికి జగన్ నాయకత్వం అవసరం



17వ వార్డు ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఎన్నికల ప్రచారం శుక్రవారం 17వ వార్డులో జోరుగా కొనసాగింది. ఇందులో భాగంగా ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ 82వ రోజు 17వ వార్డు సెక్టార్-8లో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింట ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్‌కు ఓటేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ నాయకత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రజలు ప్రస్తుతం ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి విజయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి గేదెల నాగరాజు, పార్టీ నాయకులు సుబ్రహ్మణ్యం, ప్రేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



ఏయూలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద అంజలి ఘటిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి, తదితరులు



జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎన్‌ఎంయూఏ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు



జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న వీఎంఆర్‌డీఏ కార్యదర్శి కీర్తి



బీచ్‌రోడ్డులో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బోని శివరామకృష్ణ

ఏయూ క్యాంపస్: దివంగత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని తూర్పు నియోజకవర్గంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఏయూలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వర్సిటీ అధికారులు పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, పాలక మండలి సభ్యురాలు ఆచార్య కె.దుర్గాకుమారి, ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాళ్లు ఆచార్య నరసింహారావు, జి.శశిభూషణరావు, వి.విజయలక్ష్మి, డీన్‌లు ఆచార్య టి.షారోన్‌రాజు, కె.బసవయ్య, పి.వెంకటేశ్వర్లు, డి.ఎ.నాయుడు, చిట్టిబాబు, ఎం.వి.ఆర్.రాజు, జి.వీర్రాజు, అధికారులు పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- ఎన్‌ఎస్‌ఎస్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు, ప్రోగ్రాం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూఏ కార్యాలయంలో..

మద్దిలపాలెం : బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను మద్దిలపాలెంలోని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన చిత్ర పటానికి అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి పి.వి.వి.మోహన్, విజయనగరం జోన్ కార్యదర్శి ఎం.వి.ఆర్.మూర్తి, మద్దిలపాలెం డిపో అధ్యక్షుడు ఎం.ఈశ్వరరావు, డిపో నాయకులు ఎస్.రాజు, వి.రామారావు, కె.ఎ.రావు, కె.వి.బాబు, డేవిడ్, సీసీఎస్ సభ్యులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏలో..

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి కార్యదర్శి డి.కీర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు అజరామరమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

బీచ్ రోడ్డు: బీచ్ రోడ్డులోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కార్-టీ సెల్ థెరపీతో క్యాన్సర్ నివారణ



సమావేశంలో మాట్లాడుతున్న అంకాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ రాకేష్

ఆరిలోవ: కార్-టీ సెల్ థెరపీతో క్యాన్సర్‌ను నివారించవచ్చని అపోలో అంకాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ రాకేష్ తెలిపారు. ఆరిలోవ హెల్త్‌సిటీ అపోలో ఆస్పత్రిలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ఉపాధ్యాయురాలు రెడ్డి లలితకుమారి(47) అరుదైన లింఫోమా క్యాన్సర్‌తో ఆస్పత్రికి వచ్చారన్నారు. ఆమెకు అవసరమైన ఆధునిక వైద్యం కార్-టీ సెల్ థెరపీని విజయవంతంగా పూరి చేశామన్నారు. ఈ థెరపీతో ఆమెకు క్యాన్సర్ పూర్తిగా నయమైనట్లు తెలిపారు. మానవ శరీరంలో ఉన్న టీ సెల్స్‌ను సేకరించి వాటిని ప్రయోగశాలలో మెడికల్ ఇంజినీరింగ్ నైపుణ్యంతో క్యాన్సర్ నయమయ్యేలా తయారు చేస్తామన్నారు. కొత్త మార్పులు చేసిన ఆ కణాలను మళ్లీ మనిషి శరీరంలోకి ప్రవేశపెడతామన్నారు. ఈ విధానంలో క్యాన్సర్‌కు చికిత్స విశాఖ అపోలో చేయడం అభినందనీయమన్నారు. బాధితురాలు లలిత కుమారి ఆరోగ్యంగా ఉన్నారని, శుక్రవారం డిశ్చార్జి చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో రోగి లలితకుమారి, అంకాలజీ వైద్యులు ప్రదీప్, వేణిప్రసన్న పాల్గొన్నారు.

రంజాన్‌పై సదస్సు రేపు

మద్దిలపాలెం : రంజాన్‌ను పురస్కరించుకుని బీవీ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోని, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం ఆధ్వర్యంలో ఆదివారం బుల్లయ్య కళాశాలలో సదస్సు నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందన్నారు. ఈ సదస్సుకు నాగార్జున యూనివర్సిటీ పూర్వ వైస్ చాన్సలర్ ఆచార్య బాలమోహన్‌దాస్, ముస్లింలు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

బాబు వ్యాఖ్యలపై ఆర్యవైశ్యుల మండిపాటు

తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్



గోపాలపట్నం బంక్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్యవైశ్యులు గుణిశెట్టి శ్రీనివాసరావు, తదితరులు

గోపాలపట్నం: ఆర్యవైశ్యులపై రావులపాలెంలో చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం గోపాలపట్నం బంక్ జంక్షన్ వద్ద ఆర్యవైశ్యులు ఆందోళన నిర్వహించారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గుణిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ కిరాణా షాపుల్లో గంజాయి అమ్ముతున్నారని అనడం చాలా దారుణమన్నారు. నిజాయితీగా వ్యాపారాలు చేస్తున్న తమపై రాజకీయ లబ్ధి కోసం అబాంఢాలు వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఒక్క ఆయన సామాజిక వర్గమే నిజాయితీ పరులనే దుర్మార్గపు ఆలోచనతో చంద్రబాబు ఉన్నారని మండిపడ్డారు.ఆర్యవైశ్యులను ఏనాడూ ఆదరించని చంద్రబాబుకు తమ గురించి మాట్లాడే హక్కులేదని అన్నారు. ఆయన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పక పోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఆయన దుర్మార్గపు ఎత్తుగడని చిత్తు చేసి పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల్లో చిత్తుగా ఓడించి తీరుతామన్నారు. కార్యక్రమంలో పశ్చిమ వాణిజ్య విభాగం క్లస్టర్ అధ్యక్షుడు ఉండ్రాళ్ల ప్రకాశరావు, బండారు శ్రీనివాసరావు, గుణేశ్వరరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ కొబ్బరి చెట్లకు 120 ఏళ్లు



ఆరిలోవ: ముడసర్లోవ పార్కులో ఉన్న కొబ్బరి చెట్ల వయస్సు వింటే ఔరా అంటూ ఆశ్చర్యపోవాల్సిందే. సన్నగా, పొడవుగా గాలికి ఊగుతూ కనిపిస్తున్న ఈ చెట్ల వయస్సు 120 ఏళ్లకు పైగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ముడసర్లోవ పార్కును బ్రిటిష్ అధికారులు 1903లో ఏర్పాటు చేశారు. అప్పట్లో విశాఖ వచ్చిన బ్రిటిష్ అధికారుల కోసం ఇక్కడ గెస్ట్ హౌస్‌లు నిర్మించారు. విశాలమైన ప్రదేశం కావడంతో ఆహ్లాదం కోసం వివిధ రకాల పూల మొక్కలతో పాటు కొబ్బరి, మామిడి, సపోటా తదితర పండ్ల జాతి మొక్కలను కూడా అప్పట్లో నాటారు. అలా 1903లో నాటిన కొబ్బరి మొక్కల్లో ఇప్పటికీ ఈ పార్కులో 10 చెట్లు ఉండడం విశేషం. ఇవి సన్నగా సుమారు 20 నుంచి 25 మీటర్లకు పైగా పొడవు ఉన్నాయి. దీంతో కొబ్బరి కాయలను దించడానికి ఎవరూ ఈ చెట్లే ఎక్కే సాహసం చేయలేకపోతున్నారు.

ముడసర్లోవ పార్కులో పురాతనమైన కొబ్బరి చెట్లు

ఘర్షణలకు దిగితే కేసులు తప్పవు



గాంధీనగర్‌లో రౌడీ షీటర్లు, ఆకతాయిలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ గోవిందరావు

ఆరిలోవ: ఎన్నికల వేళ ఎలాంటి అల్లర్లకు పాల్పడినా కేసులు తప్పవని రౌడీ షీటర్లు, ఆకతాయిలను ఆరిలోవ సీఐ జి.గోవిందరావు హెచ్చరించారు. ఆరిలోవ ప్రాంతం గాంధీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం రౌడీషీటర్లు, ఆకతాయిలకు కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి పోలీసులు చర్యలు చేపడుతున్నారన్నారు. అల్లర్లు, కోట్లాటలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించబోమని హెచ్చరించారు. చిన్న గొడవ జరిగినా రౌడీ షీటర్లు వెళ్లకూడదని సూచించారు. మద్యం, గంజాయి తాగి వాహనాలు నడపడం, బైక్ రేసులు నిర్వహించడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం తదితర వాటికి దూరంగా ఉండాలన్నారు. ప్రజలు నుంచి ఆకతాయిలు, రౌడీషీటర్లపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం స్థానికులతో కూడా సీఐ మాట్లాడారు. ఎలాంటి భద్రతాపరమైన సమస్యలు తలెత్తినా వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

'పని ప్రదేశంలో లైంగిక వేధింపులపై కఠిన చర్యలు'



ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ వి.విజయలక్ష్మి

ఏయూ క్యాంపస్: పని చేసే ప్రదేశంలో మహిళలు లైంగిక వేధింపులను ధైర్యంగా ఎదుర్కోవాలని, అటువంటి ఘటనలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం ఏయూ ఎన్ఎస్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రోగ్రాం అధికారుల శిక్షణ తరగతుల్లో రెండో రోజు ఆమె పోష్ చట్టంపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు బాలల పాలిట శాపాలుగా మారుతాయని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సుధ అన్నారు. బాల్య వివాహాలను నిషేధించినప్పుడే సామాజిక ప్రగతి సాధ్యపడుతుందన్నారు. అనంతరం బాల కార్మిక వ్యవస్థ నిషేధ చట్టంపై ఆచార్య ఎస్.నిర్మల, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ 2000పై దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ సి.పి.నందిని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరనాథ్, డాక్టర్ పల్లవి, 40 మంది ప్రోగ్రాం అధికారులు, జాతీయ సేవా పథకం కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.7 లక్షల నగదు స్వాధీనం

ఎంవీపీ కాలనీ: ఎన్నికల తనిఖీల్లో భాగంగా ఎంవీపీ పోలీసులు రూ.7 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం ఉదయం ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలి వద్ద ఎస్‌ఐ ఎస్.శ్రీనివాస్, తదితర సిబ్బంది గస్తీ కాస్తున్నారు. ఆ సమయంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మజ్జి రమణ అనే వ్యక్తి వద్ద రూ.7 లక్షలు నగదు ఉన్నట్టు గుర్తించారు. ఆ నగదుకు సంబంధించిన సరైన డాక్యుమెంట్స్ లేకపోవడంతో గ్రీవెన్స్ సెల్‌కు నగదును అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ వెల్లడించారు.